వైభవంగా యాదగిరీశుడి నిత్య కల్యాణం

స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 24 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. మంగళవారం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి సేవను ఊరేగించారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. నిజాభిషేకంలో భాగంగా నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్ర నామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపారు. సాయంత్రం స్వామివారిని గరుఢ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై వేంచేపు చేసి మొదటి ప్రాకార మండపంలో ఊరేగించారు. ఆలయ ముఖ మండపంలో సువర్ణమూర్తులకు దర్బార్ సేవ చేపట్టారు. స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. రాత్రి ప్రధానాలయం ముఖ మండపంలో ప్రతిష్ఠామూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చన జరిగాయి. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు సాగాయి. క్షేత్ర పాలకుడైన ఆంజనేయస్వామి నాగావళి దళార్చన ఘనంగా జరిగింది. సుమారు 7వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.10,23,465 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

గోశాలలో వన మహోత్సవం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని గోశాల ప్రాంగణంలో మంగళవారం ఎస్పీఎఫ్ సిబ్బంది ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, ఎస్పీఎఫ్ కమాండెంట్ త్రినాథ్ పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాజు, ఆలయ డీఈఓ దోర్బాల భాస్కర్‌శర్మ, ఈఈ దయాకర్‌రెడ్డి, ఏసీపీ రమేశ్‌కుమార్, పట్టణ సీఐ రమేశ్, ట్రాఫిక్ సీఐ కృష్ణ, ఎస్పీఎఫ్ సీఐ శేషగిరిరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ గంగాధర

వాటర్ మెన్ శిక్షణ ప్రారంభంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గంగాధర్

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబర్ 24 : గ్రామాల్లో మంచినీటి సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు సన్నద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండలంలోని 26 గ్రామ పంచాయతీల గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణలో ఆయన మాట్లాడారు. వాటర్ మెన్ అవగాహన కలిగి ఉన్నప్పుడే సమస్యలను తక్షణమే గుర్తించి పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ నీటి నిర్వహణ సమస్యలపై సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. మొదటి రోజు శిక్షణలో చేతి పంపుల గురించి శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ భువనగిరి డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ కరుణాకరన్, గ్రిడ్ ఇంజినీర్ లక్ష్మీనారాయణ, సబ్ డివిజనల్ ఇంజినీర్ పి.దీన్‌దయాల్, డివిజనల్ పంచాయతీ అధికారి ప్రతాప్‌నాయక్, వి.విశాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ ఫైళ్లను త్వరగా క్లియర్ చేయాలి

- అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

తాసీల్దార్ కార్యాలయంలోని ధరణి కంప్యూటర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

ఆత్మకూరు(ఎం), సెప్టెంబర్ 24 : ధరణి కేంద్రాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను, దరఖాస్తులను వెంటనే పూర్తి చేసి సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ అన్నారు. తాసీల్దార్ కార్యాలయంలోని ధరణి కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులకు సంబంధించిన భూ రిజిస్ట్రేషన్లను ఎలాంటి ఇబ్బంది లేకుండా చేపట్టాలన్నారు. మండలంలోని ప్రభుత్వ భూములకు సంబంధించిన బై నెంబర్లను సరిచేయాలని సూచించారు. ఆయన వెంట తాసీల్దార్ రవికుమార్, డిప్యూటీ తాసీల్దార్ సఫియొద్దీన్, ఆర్ఐ మల్లికార్జున్‌రావు ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలి

- జడ్పీ సీఈఓ శోభారాణి

ప్రభుత్వ ఆసుపత్రిలో చింటి పాపను ఎత్తుకున్న జడ్పీ సీఈఓ శోభారాణి

సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 24 : ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జడ్పీ సీఈఓ శోభారాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మిషన్ భగీరథ సిబ్బంది శిక్షణలో ఆమె మాట్లాడారు. మిషన్ భగీరథ సిబ్బందికి నాలుగు రోజులపాటు శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలను వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛతా హీ వారోత్సవాల్లో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణయ్య, ఈఈ కరుణాకరన్, ఏఈ శ్రీనాథ్‌రెడ్డి, ఎంపీఓ నర్సింహ పాల్గొన్నారు.

కాలుష్య కంపెనీలను ఏర్పాటు చేయొద్దు

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

పరిశ్రమ ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

రామన్నపేట, సెప్టెంబర్ 24 : ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే కాలుష్య కంపెనీలను రామన్నపేటలో ఏర్పాటు చేయవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామన్నపేట – కొమ్మాయిగూడెం రెవెన్యూ పరిధిలో అంబుజా సిమెంట్ పరిశ్రమకు కొనుగోలు చేసిన స్థలాన్ని పార్టీ మండల నాయకులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రై పోర్టు పేరుతో రైతులను నమ్మించి 300 ఎకరాల భూమి కొనుగోలు చేసి ఇప్పుడు సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికే మూసీ కాలుష్య ముప్పుతో, చౌటుప్పల్, చిట్యాల మండలాల వ్యర్థ రసాయనాల పరిశ్రమలతో ప్రజా ఆరోగ్యం, వ్యవసాయం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే 15 కిలోమీటర్ల మేర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ సమయాన్ని పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మేక అశోక్‌రెడ్డి, జెల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, కూరెళ్ల నర్సింహాచారి, వనం ఉపేందర్, ఆనంద్, నరేందర్, లెనిన్, హన్మంతు, సోములు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ మండల కమిటీ ఎన్నిక

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 24 : పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో మంగళవారం జరిగిన పీఆర్‌టీయూటీఎస్ సర్వసభ్య సమావేశంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.సురేంద్రమోహన్, ప్రధాన కార్యదర్శిగా పి.ఇస్తారి, మహిళా ఉప అధ్యక్షురాలిగా వై.శోభ, మహిళా కార్యదర్శులుగా సి.శ్రవంతి, కె.కనకయ్య ఎన్నికయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జాలిగామ రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి ధర్మారపు వెంకటయ్య, నాయకులు కరుణాకర్‌రెడ్డి, ఉపేందర్‌రావు, సోమరాజు, సత్యనారాయణ, నర్సింహారెడ్డి, నిరంజన్‌రెడ్డి, వీరారెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట ప్రసాదాలపై అప్రమత్తం

- హైదరాబాద్ ల్యాబ్‌కు నెయ్యి నమూనాలు
- ఈ నెల 30న నివేదిక
- యాదగిరిగుట్ట ప్రసాదంలో 40 ఏండ్లుగా నార్మూల్ నెయ్యి వినియోగం

యాదగిరిగుట్టలో ప్రసాదం తయారీని పరిశీలిస్తున్న ఆలయ ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 24 : తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యి కల్తీ జరిగిందన్న నేపథ్యంలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ అధికారులు అప్రమత్తమయ్యారు. స్వామివారి ప్రసాదంలో వినియోగిస్తున్న నెయ్యి నమూనాలను హైదరాబాద్‌లోని ఆహార ప్రయోగశాలకు పంపించారు. ఈ నెయ్యిలో ఏదైనా కల్తీ జరిగిందా.. అని తెలుసుకునేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన నివేదిక ఈ నెల 30లోపు వస్తుందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. కాగా, దేవస్థానంలోని లడ్డూ ప్రసాదాల తయారీలో 40 ఏండ్లుగా నార్మూల్ సంస్థకు చెందిన నెయ్యిని వినియోగిస్తున్నారు. నెలకు సుమారు 20 నుంచి 25 వేల కిలోల నెయ్యిని వాడుతున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఒక్కో లడ్డూకు 90 నుంచి 100 గ్రాముల నెయ్యిని వినియోగిస్తున్నారు. దాంతోపాటు లడ్డూ తయారికి కావాల్సిన యాలకుల పొడి, జీడిపప్పు, కిస్మిస్ పొడి, చక్కెర పాకం, బూంది వంటి ముడి సరుకులు సైతం తాజాగా సేకరించి వినియోగిస్తున్నారు. రోజు అనుభవజ్ఞులైన తయారీదారులతో పరీక్షించి మరీ భక్తులకు అందజేస్తున్నారు. యాదగిరిగుట్ట ఆలయం పునఃప్రారంభం తర్వాత ప్రసాదాలు సిద్ధం చేసేందుకు అధునాతన యంత్రాలను వినియోగిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలోనే రూ.13.8 కోట్లతో భారీ యంత్రాలను చెన్నై, పుణే, హర్యానా, ముంబయి, రాజమండ్రి వంటి ప్రదేశాల నుంచి తీసుకొచ్చి మానవ రహిత లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేస్తున్నారు. బూంది ప్లైయర్, షుగర్ సీరప్ మిషన్స్, దాల్ పుల్వలైజర్, గ్రైండింగ్ మిషన్, చక్కెర సైలోస్ మిషన్ వంటి ఆధునాత యంత్రాలలో లడ్డూ ప్రసాదాలను తయారు చేస్తున్నారు. బోగ్ (దేవుడికి సమర్పించే పరిశుభ్రమైన నైవేద్యం) సంస్థ దేవస్థాన ప్రసాదాలపై సంతృప్తి వ్యక్తపరిచింది. యాదగిరిగుట్టలో ఆరోగ్యకరమైన నాణ్యత ప్రమాణాలు చాలా మెరుగ్గా ఉన్నాయని కితాబునిస్తూ గతేడాది మార్చి 28న బోగ్ సర్టిఫికెట్‌ను కేంద్ర ప్రభుత్వం అందజేసింది. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా సర్టిఫికెట్‌ను పొందిన దేవాలయంగా యాదగిరిగుట్ట క్షేత్రం నిలిచింది.

దివ్యాంగురాలిపై లైంగికదాడి నిందితుడి అరెస్టు

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 24 : మండలంలోని ఓ గ్రామంలో మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 18న మండలంలోని ఓ గ్రామంలో మానసిక దివ్యాంగురాలిపై అదే గ్రామానికి చెందిన జె.మధు లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

భువనగిరి చెరువులో యువకుడి మృతదేహం

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 24 : భువనగిరి పెద్ద చెరువులో యువకుడి మృతదేహం లభ్యమైంది. పట్టణంలోని పెద్ద చెరువులో మంగళవారం యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. పట్టణంలోని తాతానగర్‌కు చెందిన ముదిగొండ రాజ్‌కమల్ సోమవారం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్ద చెరువు పక్కనే ఉన్న తాతానగర్ కాలనీలో నివాసం ఉండే రాజ్‌కమర్ కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో చెరువు వద్దకు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి రాజ్‌కమల్‌గా గుర్తించారు. పోలీసులు పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా దవాఖానకు తరలించారు.

ఆటోను ఢీకొట్టిన కారు

- ఐదుగురికి గాయాలు

రోడ్డు పక్కన బోల్తా పడిన ఆటో

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 24 : ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో ఆటో డ్రైవర్‌తోపాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. భువనగిరి నుంచి చాడ గ్రామానికి వెళ్తున్న ప్యాసింజర్ ఆటోను మండలంలోని వీరవెల్లి గ్రామ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన షిఫ్ట్ కారు ఢీకొని ముందున్న బొలేరో వాహనాన్నీ ఢీకొట్టింది. కారు ఢీకొనడంతో ఆటో రోడ్డు పక్కకు పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో పులిగిల్ల గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ వేముల రాజు, మరో నలుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు.

గొంగిడి సునీతపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం

- బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 24 : మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య అన్నారు. యాదగిరిగుట్ట బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీగా ఉండి ఆలేరు నియోజకవర్గానికి రూపాయి అభివృద్ధి చేయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కాంగ్రెస్ పార్టీ నాయకులకు మింగుడు పడడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే సునీతపై కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కానుగు బాలరాజు, నాయకులు కల్లెపల్లి శ్రీశైలం, గుండ్లపల్లి భరత్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. నియోజకవర్గ అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యాదగిరిగుట్ట దేవస్థానాన్ని రూ.1300 కోట్లతో దేశం గర్వపడేలా అభివృద్ధి చేశారన్నారు. గతంలో మంజూరైన పనులను తిరిగి ప్రారంభిస్తూ తమ అభివృద్ధి అని బీర్ల ఐలయ్య ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. గుట్టకు ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. ఆ కళాశాలను భువనగిరికి తరలిస్తుంటే స్థానిక ఎమ్మెల్యే ఐలయ్య అడ్డుకునే ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. ఆలేరు, వంగపల్లి జాతీయ రహదారిపై అండర్ పాస్ బ్రిడ్జి మంజూరుకు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత కృషి ఉందన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నిర్మించి ఆలేరుకు సాగు జలాలను అందిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, నాయకులు బీరయ్య, స్వామి, శ్రీధర్‌గౌడ్, నర్సింహ, రమేశ్, చంద్రం, రాజు, వీరేశం, దావూద్, క్రాంతి, రాజు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై దాడి సిగ్గుచేటు'

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు అరుణ

ఆత్మకూరు(ఎం), సెప్టెంబర్ 24 : బీఆర్ఎస్‌కు చెందిన మహిళా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం సిగ్గు చేటు అని బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు సోలిపురం అరుణ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వినాయక నిమజ్జనం ముసుగులో కాంగ్రెస్ కార్యకర్తలు అర్ధరాత్రి అరాచకంగా మహిళా ఎమ్మెల్యే ఇంటి గేట్లు పగులగొట్టి రాళ్లదాడి చేయడం హేయమైన చర్య అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇలాంటి దౌర్జన్యాలను ప్రోత్సహించడం సరికాదన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని వాగ్దానం చేసి 9నెలలు గడుస్తున్నా నెరవేర్చకుండా మహిళలను మోసం చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ యాస కవిత, మహిళా నాయకులు బీసు ధనలక్ష్మి, శశికళ, పద్మ, రాములమ్మ, నర్సమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి : సీఐ

సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

రామన్నపేట, సెప్టెంబర్ 24 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు కృషి చేయాలని సీఐ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కక్కిరేణి గ్రామ పాఠశాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన నాలుగు సీసీ కెమెరాలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాఠశాలకు సీసీ కెమెరాలు అందజేసిన మాజీ సర్పంచ్ పిట్ట కృష్ణారెడ్డి, చిల్ల ప్రభావతి, రామకృష్ణ, సింగిల్‌విండో డైరెక్టర్ పిట్ట రాంరెడ్డి, కన్నెబోయిన జగన్‌ను అభినందించి సన్మానించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లయ్య, ప్రధానోపాధ్యాయుడు హన్మంతరావు, సామాజిక కార్యకర్త వేముల సైదులు, సోమేశ్వర్‌రావు, ముక్కాముల శ్రీను పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

- అత్యధికంగా మోత్కూరులో 79.3 మి.మీ. వర్షపాతం

రాజాపేట : బేగంపేట వాగులో ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరిక

భూదాన్ పోచంపల్లిలో కెనరా బ్యాంక్ ఎదుట రోడ్డుపై నిలిచిన నీరు

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 24 : జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా మోత్కూరులో 79.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గుండాల మండలంలో 65.3 మి.మీ., అడ్డగూడూరులో 63.5, చౌటుప్పల్‌లో 62.3, రాజాపేటలో 59.3, తుర్కపల్లి(ఎం)లో 39.4, ఆత్మకూరు(ఎం)లో 34.8, ఆలేరులో 32.3, మోటకొండూరులో 27.3, యాదగిరిగుట్టలో 25.5, బొమ్మలరామారంలో 17.5, భువనగిరిలో 14.5, భూదాన్ పోచంపల్లిలో 12.3, రామన్నపేటలో 3.8, వలిగొండ మండలంలోన 2మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

మోటకొండూర్ : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది. ఆయా గ్రామాల్లో విద్యుత్‌కు స్వల్ప అంతరాయం ఏర్పడింది.

భూదాన్ పోచంపల్లి : మండలంలో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. మున్సిపాలిటీలో పల్లపు ప్రాంతాల్లో, రోడ్లపై వర్షపు నీరు నిలిచింది. కెనరా బ్యాంక్ ఎదుట రోడ్డుపై నీరు నిల్వడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

బేగంపేట వాగులో ప్రమాద హెచ్చరిక

రాజాపేట : తుర్కపల్లి మండలం గంధమల్ల చెరువు అలుగు పోస్తుండడంతో బేగంపేట వాగులో రోడ్డుకు ఇరువైపులా ప్రమాద హెచ్చరికలను ఏర్పాటు చేశారు. వాగులో బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో సంబంధిత కాంట్రాక్టర్లు ప్రత్యేక దారి ఏర్పాటు చేశారు.

వరద నీటిలో వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా ముందస్తుగా ప్రమాద హెచ్చరిక ఏర్పాటు చేసి వాగుకు ఇరువైపులా దారి మూసివేశారు.

విశ్రాంతి తీసుకోని ఉపాధ్యాయుడు

- రిటైర్డ్ అయినా స్వచ్ఛందంగా పాఠాలు చెబుతున్న టీచర్ యాదయ్య

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు యాదయ్య

సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 24 : సుమారు 28ఏండ్లపాటు చదువు చెప్పిన ఆ ఉపాధ్యాయుడు.. రిటైర్డ్ అయినా విశ్రాంతి తీసుకోవడం లేదు. తాను చదివిన పాఠశాలలో స్వచ్ఛందంగా విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. మండల కేంద్రానికి చెందిన బాలగోని యాదయ్య మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో 28 సంవత్సరాలపాటు ఉపాధ్యాయుడిగా పని చేశారు. ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగోన్నతి పొందిన ఆయన.. నాలుగు నెలల క్రితం కంకణలగూడెం ప్రభుత్వ పాఠశాలలో రిటైర్డ్ అయ్యారు. అయితే.. మండల కేంద్రంలోని బాలుర ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు సరిపడా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న యాదయ్య రోజూ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు స్వచ్ఛందంగా పాఠాలు చెబుతున్నారు. తాను చదువుకున్న పాఠశాలలోనే ఉపాధ్యాయుడిగా తొలి ఉద్యోగం సాధించానని చెప్పారు. రిటైర్డ్ అయిన తరువాత అదే పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధించడం చాలా సంతృప్తిగా ఉన్నదని యాదయ్య అంటున్నారు.

తెలంగాణ ఉద్యమ నాయకుడు లక్ష్మయ్య మృతి

- బీబీనగర్ ఎయిమ్స్‌కు మృతదేహం అప్పగింత

రామన్నపేట, సెప్టెంబర్ 24 : తెలంగాణ ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ సీనియర్ నేత, న్యాయవాది బొడిగె లక్ష్మయ్య అనారోగ్యంతో సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో మృతిచెందాడు. తెలంగాణ ఉద్యమ సమయంలో జేఏసీ ఇచ్చిన ప్రతి పిలుపులో ఆయన భాగస్వాములయ్యారు. తన బైక్‌కు బీఆర్ఎస్ పార్టీ జెండాను కట్టుకొని తిరిగాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని ఆయన స్వగ్రామం శోభనాద్రిపురానికి తీసుకొచ్చారు. గ్రామంలో అంతిమయాత్ర నిర్వహించిన అనంతరం పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులు బీబీనగర్ ఎయిమ్స్‌కు అప్పగించారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ నేత చెరుకు సుధాకర్, బీఆర్ఎస్‌వై రాష్ట్ర నాయకుడు కాల్య శ్రవణ్‌కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఏ మాజీద్, ఐలు రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పోచబోయిన మల్లేశం, బండెల రాములు, ఎస్‌కే చాంద్, అశోక్, నరేందర్, శ్రీనివాస్, రాఘవరెడ్డి, నివాళి అర్పించారు.

పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ పరామర్శ

అడ్డగూడూరు : కొండంపేటలో మల్లమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

మోత్కూరు, సెప్టెంబర్ 24 : మున్సిపాలిటీకి చెందిన పురోహితుడు పారునంది వెంకటర